
# పోతంశెట్టి గనిరాజుగారు

పిల్లికళ్ళతో నల్లగా దుంగలా ఉండే గనిరాజు జుట్టు మొత్తం పండిపోయింది. ఎప్పుడూ పంచె, భుజం మీద కాశీ తువ్వాలుతో కనపడే గనిరాజు చొక్కాగానీ, బనేనుగానీ వేసుకోడం మేమెరగం. మా వెనకటి తరంవాళ్ళని అడిగితే మేము ఎరగం అన్నారు వాళ్ళు. ఆఖరికి పండగలొచ్చినా పబ్బాలొచ్చినా ఆ పంచె, కాశీ తువ్వాలే.

పోతంశెట్టి గనిరాజు చిన్నా పెద్దా అని చూడడు. ఈకులం ఆకులం అన్న తేడా లేదు. అందర్నీ పలకరిస్తాడు అందర్నీ ఇష్టపడతాడు. భుజం మీద చెయ్యేసి "ఏంటి బాబా?" అని పలకరించేడంటే ఆ పలకరింపులోనే, ఆ చెయ్యి తాకడంలోనే గనిరాజు మనసంతా నిండి ఉంటది. అసలు అలాంటి మనుషులు ఎక్కడో ఉంటారేమో... కాఫీహోటేలు గోపాలరావుగారన్నట్టు అసలుండరేమో!



చీకటిపడి చాలా సేపయింది.

ఊరు మాటు మణిగింది.

చప్పుడు చేయకండా వీస్తుంది చలి గాలి.


ఆకాశంలో చుక్కలు చక్కగా మెరుస్తున్నాయి.

వంతెన కింద సత్రంలో ఉండే అన్నపూర్ణ కావిడి సాధువు అప్పుడే పెద్దీధిలోకి దిగేడు. దూరంగా ఇడ్లీల సుబ్బాయమ్మగారింటవతల కోర్రావులుగారి గాదుల దగ్గర పిచ్చికుక్కని రెండు ఊరకుక్కలు తరుముతున్నాయి.

చేగల్నాడులో గరువు మీద కెళ్ళిన ద్వారంపూడి రాఘవరెడ్డి రాత్రి పది దాటినా రాలేదు. ఇటు పక్క చూస్తే వాళ్ళమ్మాయి ప్రభావతికి నెప్పులు మొదలయ్యినియ్యి. గిలగిలా కొట్టేసుకుంటుంది మనిషి. ఇంట్లో మనుషులూ, చుట్టు పక్కలోళ్ళు మూగారు. బండిరేవుగట్టు దగ్గరున్న గనిరాజుకి ఎలా తెల్సిందో ఎప్పుడు తెల్సిందో గానీ పరుగు పరుగుమని గేలాపెట్టుకుంటా వచ్చేసి "బెంబేలు పడిపోకండి బుల్లీ...

పిల్లకి మొదటి కాన్పు కదా కాస్త సలుపుగానే ఉంటదమ్మా'' అంటా ఓదార్చి పరుగు పరుగునెళ్లిపోయి కాలవకాడున్న గొలుగూరి సత్తిరాజు జట్కాబండి తీసుకునొచ్చి ముందు రాఘవరెడ్డి భార్యనీ కూతుర్నీ ఎక్కించుకుని రామచంద్రపురం చెలికాని రామారావుగారి హాస్పిటల్లో చేర్పించేడు.

ఎక్కడా ఆగకండా గిలగిలా కొట్టుకుంటానే ఉన్న పిల్లని పరీక్ష చేసిన రామారావుగారి భార్య కమలమ్మడాక్టరుగారు ''ఆపరేషను పడద్ది... పిల్ల ఒంట్లో రక్తం తక్కువుంది ఎవరిదన్నా రక్తం కావాలమ్మా'' అన్నారు.



ఆముక్క విన్న గనిరాజు ''నా రక్తం పనికొస్తాదేమో కొంచెం చూద్దురు తల్లీ'' అన్నాడు.

పరీక్ష చేసి చూస్తే పనికొచ్చింది.

ఆ పనయ్యేకా మందులకనీ, ఇంజక్షన్లకనీ మందులకొట్లకీ హాస్పిటలుకీ కల తిరుగుతున్నాడు గనిరాజు.

ఆపరేషన్ మొదలైంది.

రాఘవరెడ్డి ఇంట్లో మనుషులు బాగానే ఉన్నారు. గనిరాజు కంగారూ గోలా మాత్రం చాలా ఎక్కువైపోయింది. హాస్పిటల్లో ఆ పక్కనించి ఈ పక్కకీ ఈ పక్కనించి ఆ పక్కకీ కల తిరిగేస్తున్నాడు. ఎదురొస్తున్న పేషెంట్లనీ, నీళ్ళ బేసిను పట్టుకెళ్తున్న నర్సు సూరేకాంతాన్నీ గుద్దేస్తున్నాడు. తల్లీబిడ్డా క్షేమం అని తెలిసేక ఆనందంతో, ఉబ్బితబ్బిబ్బయిపోయి ''అయితే ఒక జీవి ఎక్కడో రాలిపోయి ఇక్కడ తేలడం జరిగిపోయిందన్నమాట...సంతోషం'' అనుకున్నాడు గనిరాజు.

సరిగ్గా ఇరవై ఒకటోరోజు బారసాలప్పుడు ఊళ్ళో జనంతో పాటు గనిరాజుకూడా వచ్చేడు. ఎదురొచ్చిన గనిరాజు జబ్బ పట్టుకున్న రాఘవరెడ్డి 'నేను ఊళ్ళో లేనప్పుడు నా బిడ్డని కాపాడేవు గనిరాజు మావా... ఏం పెడితే తీరద్ది చెప్పు నీరుణం'' అన్నాడు.

''ఊరుకోరా బాబా... ఇదిగో మన పిల్లకి మనం చేసుకోకపోతే ఎవడొచ్చి చేస్తాడు జెప్పు'' అంటా భోజనాల బంతిలో చివర్నకూర్చుని తినేసి ఎంగిలిస్తరి దొడ్డి గోడవతల పారేసి చెయ్యీ మూతీ కడుక్కుని కాశీతువ్వాల్తో తుడుచుకుంటూ ''పుట్టుక ఒక ఆనందం... ఆ భగవంతుడు గొప్పోడు సుమా'' అనుకుంటా వెళ్లిపోయేడు.

* * *

బుచ్చిరాజు కిళ్ళీకొట్టు దిగువలో ఉన్న మాలపేటలో ఒక దూళ్ళపాక చుట్టూరా బీరపాదూ, ఆనబపాదూ కల్సి పచ్చటి దడికట్టేనియ్యి, ఒకపాక ముందు మంచం పట్టెడవిప్పేసి కోళ్ళ సందుల్లో ఉన్న నల్లులు చావడానికి కొబ్బరిడొక్కు గరిటెతో కాగిపొగలు గక్కుతున్న నీళ్ళు పోస్తుంది శివాలచ్చుం గోడకి జారేసిన మడత మంచం మీద పక్కబట్టలు పెట్టింది ఏసురత్నం కూతురు.

రేపు రాత్రి సవరం వీరన్న కూతురు పెళ్ళి. వాసాలూ వెదురుగెడలూ ఇస్తాను పొద్దుటే రమ్మన్న పొట్టిరెడ్డి రాత్రే పాలమూరు వెళ్ళిపోయేడు. ఇప్పుడెలాగా అని దిగులు పడతా కూర్చున్నాడు వీరన్న.

పిల్లిపెసర మోపుతో వెళ్తున్న గనిరాజు సంగతి కనుక్కుని నవ్వేసి ''ఆడిచ్చినట్టే నువ్వు పందిరేసి పిల్ల పెళ్ళి చేసినట్టే గానీ నాకూడా రా'' అన్నాడు.

మొన్న తుఫానుకి వాళ్ళ ఆరుకుంచాల పొలంలో పడిపోయిన జంట తాడిచెట్లని వాసాలు కింద కోయించి దూళ్ళ సావిట్లో పెట్టిన గనిరాజు, ఆ వాసాలు వెదురుగెడలూ మోసుకునెళ్ళి వీరన్న ఇంటి ముందర పందిరేసేడు. పైన కప్పడానికి తాటాకులు లేకపోతే వడ్లాచంద్రయ్యగారి దొడ్లో కొబ్బరాకులు కొట్టుకొచ్చి చల్లటి నీడనిచ్చేలాగ చిక్కగా కప్పేసేడు. పసగాడి వీరాస్వామిగారి దొడ్డి గోడదగ్గర మావిడిరొబ్బలు విరుచుకొచ్చి తోరణాలు కట్టేసరికి సవరం వీరన్న గాడింటికి అప్పుడొచ్చింది పెళ్ళికళ.

పెళ్ళికొడుకు క్రిష్టియను. తాళ్ళరేవు దగ్గర బొడ్డు వెంకటాయపాలెంలో టీచరట. పెళ్ళి క్రిష్టియన్ పద్ధతిలో జరగాలని గొడవ పెడ్తున్నాడు. హిందూ పద్ధతిలో జరగాలనేమో వీరన్న పట్టుబడుతున్నాడు. ఇద్దరి మధ్యలోకీ వచ్చిన గనిరాజు ''దెబ్బలాడుకోకండెహె'' అని ఇద్దరికీ దొబ్బులెట్టి ఫాస్టరు ఏసుపాదంగారితో పెళ్ళి కొడుక్కి ఇష్టమైన కిరస్తానీ పద్ధతిలోనూ, బ్రేమ్మలు సుబ్బారావుగార్ని పిలిపించి ఇటూ వీరన్నగాడి కోరిక ప్రకారం హిందూ పద్ధతిలోనూ పెళ్ళి జరిపించేసేడు.

అలా పెళ్ళి జరిగిపోయేక ఇక భోజనాల తంతు మొదలైంది.

బంతికి ఆ చివర కూర్చుని భోజనం చేసిన పోతంశెట్టి గనిరాజు విస్తరి తీసేసి మూతీ చెయ్యీ కడుక్కుని కాశీతువ్వాలుతో చెయ్యి తుడుచుకుని ''అసలు పెళ్ళంటే ఏంటి. బతుకులు అల్లరి చిల్లరయిపోకండా కుదురుగా ఉంటానికి పూర్వపోళ్ళు ఏసినమంత్రం..అంతే'' అనుకుంటా అక్కడ్నించెళ్ళిపోయేడు.

* * *

ఎండిన ఆవేప చెట్టు కొమ్మకి చిట్ట చివర కూర్చున్న రెండు పిచ్చికలు హాయిగా మాటాడుకుంటున్నాయి, చుట్ట గుడిశ మీదికి పాకిన గుమ్మడి పాదుకాయలు పాకమీద తాటాకుల కంటే ఎక్కువున్నాయి. కోరి శేషయ్యగారి ఇంటెనకాల ఎండిన నీళ్ళగోలెం అంచుమీద నిలబడుంది బొంతకాకి. కర్రోరి వీధిలో చాకలి పుల్లయ్య చనిపోయేడు. శవం పక్కనున్న స్తంభానికి జారగిలబడి ఏడుస్తుంది పుల్లయ్యపెళ్ళాం. ఏడ్చి ఏడ్చి ఉన్న పిల్లలు మాసిన బట్టల మూటల్లో కూరుకుపోయి నిద్రోతున్నారు. వచ్చిన బంధువులు మట్టి అరుగుల మీదా తలుపుల్లేని గుమ్మాల దగ్గరా జేరబడున్నారు. బంధువుల్లో కొత్తోళ్ళు దిగినప్పుడల్లా అంతసేపూ మామూలుగా ఉన్న పుల్లయ్య పెళ్ళాం మళ్ళీ గొళ్ళు మంటుంది.

మొండి అప్పన్న, తాపీ సద్గుణరెడ్డి చెప్పిన కబురందుకున్న గనిరాజు పుల్లయ్య ఇంటికొచ్చేడు.

పాడికట్టడానికి వెదురుగెడల్లేవు. చిక్కుడుపాయకి కట్టినియ్యి లాగి చూస్తే బూలుగుపోయి ఉన్నాయి. ఏం చేద్దాహ అని ఆలోచించి మట్టి అరుగుమీద నిద్రోతున్న ఆదియ్య కొడుకు రవణని లేపి రాంపురం వెళ్ళి కొత్త ఎదురుబొంగులు కొనుక్కుని రమ్మని డబ్బులిచ్చి పంపేడు. తాగితూల్తా వెళ్తున్న రామ్మూర్తిగారి సత్యాన్ని పిల్చి పెదెంకట్రాజు బట్టలకొట్లో ఆరు గజాలమల్లుగుడ్డ చింపించుకు రమ్మన్నాడు. చుక్కా రావుడ్ని పిల్చి కుమ్మరి కోటయ్య గారింట్లో కెళ్ళి రెండు కుండలు తెమ్మన్నాడు. కోరుకొండ అబ్బాయిద్వారా బాజాలు వాయించే వాళ్ళకి కబురెట్టేడు. అలాగ గనిరాజు పన్లు పురమాయిస్తుంటే అది చావో పెళ్ళో అర్థంగానంత సందడిగా తయారైందక్కడ.

ఓ కడుగు దాటేసరికి పాడితో పాటు అన్నీ తయారైపోయినియ్యి బాజాలు మొదలైనియ్యి.

శవానికి స్నానం చేయించి పాడెమీదెక్కించేకా లేపేరు. గనిరాజుకూడా ఓ కొమ్ము పట్టేడు. స్మశానం వేపెళ్తా ''అంతా ఏడుస్తారుగానీ చావూ ఒక ఆనందమే'' అనుకుంటా పాడి మోస్తున్నాడు గనిరాజు.

చితిమీద పేర్చిన పుల్లయ్య శవానికి నిప్పంటించాక కొత్తబట్ట పరపరా కాలిపోయింది దాన్ని చూసి నవ్వుకున్న గనిరాజు ''ఎనకటికెవరో అన్నట్టు ఈ గుడ్డ పుట్టినప్పుడూ వుండదు పోయేటప్పుడూ ఉండదు. మధ్యలోనే ఈ గందరగోళమంతా'' అన్నాడు.

పుల్లయ్యది పెద్ద శరీరం పుల్లలు సరిపోవేమో అన్న అనుమానమొచ్చిన గనిరాజు ఊళ్ళోకి పరుగెట్టేడు.

సూరిబాబు కమ్మరికొలుం బయట పనికిరాని పాత బండి చక్రం ఒకటి గోడకి జేరేసుంది. పుల్లయ్యశవం గురించి చెప్పి ''కాస్త అదియ్యిబాబా'' అని బతిమాలి ఆ చక్రాన్ని దొర్లించుకుంటా వచ్చిన గనిరాజు చక్రంలో ఏ ఆకుకా ఆకు విడదీసి చితిమీద వేస్తుంటే ఆనాక బ్రహ్మాండంగా కాలడం మొదలెట్టింది శవం.

బాజాలు వాయించినోళ్ళకీ, డప్పులు వాయించినోళ్ళకీ కూలితో పాటు సారాకి డబ్బులిచ్చి పంపేసి వస్తుంటే చితి దగ్గర కూర్చుని తెగ ఏడుస్తున్నాడు పుల్లయ్య చిన్నకొడుకు. వాడి దగ్గరకెళ్ళి భుజం మీద చెయ్యేసి దువ్విన గనిరాజు ''అలా ఏడవకూడదురా బాబా..మనం ఊరెళ్ళేటప్పుడు బస్సు ఎలా ఎక్కుతామో, పోయిం తర్వాత పాడికూడా అలా ఎక్కాలి. కబురొచ్చేకా తప్పదురా... ముందు మీ నాన్న,

తర్వాత నేనూ, ఆ తర్వాత నువ్వు ఇలా ఎవరి వంతొస్తే ఆళ్ళు ఎక్కాల్సిందే ఈ పల్లకీ. తప్ప, ఇక్కడెవరూ ఉండటానికి లేదురా బాబా'' అంటుండగానే బాగా చీకటి పడిపోయింది.

పొలంలో మేసిన గేదెల్ని తోలుకుంటా ఇళ్ళ కొస్తున్నారు పాలేళ్ళు. రామచంద్రపురంలో గులేబకావళికథ సినేమా మేట్నీ చూసిన వెదురుపాక కుర్రోళ్ళు తిరిగెళ్ళి పోతున్నారు సైకిళ్ళమీద. గాలివాటం పెరిగేకొద్దీ చితిలో నిప్పులు ఎర్రబడుతున్నాయి.

పుల్లయ్య పోయిన పదోరోజున మనిషొచ్చి పిలిస్తే వెళ్ళిన గనిరాజు బంతిలో ఆ చివర్న కూర్చుని భోజనం చేసి విస్తర్ని కోరిశేషయ్యగారి గోడవతల పారేసి మూతీ చెయ్యీ కడుక్కుని ''నా సొమ్మూ, నా సారా, నా చాకిరేవూ అంటా ఉండేవోడు పుల్లయ్యగాడు చివరికేం పట్టుకెళ్ళలేదుగానీ, నాకు మట్టుకి భోజనం పెట్టేడు'' అనుకుంటా వెళ్ళిపోయేడు.

* * *

సంకురాత్రి పండగొచ్చింది.

నడవడానికి సందులేకండా ముగ్గుల్తో నిండిపోయి ఉన్నాయి ఊళ్ళో వీధులు.

ఎక్కడ చూసినా కొత్త బట్టలు వేసుకు తిరిగే జనమే.

ఆలశ్యంగా గూటిపడవలూ, బస్సులూ దిగిన కొత్త అల్లుళ్ళు హడావిడిగా అత్తారిళ్ళ వేపు నడుస్తున్నారు.

పాడతా వస్తున్న హరిదాసుకి దండ కడ్తున్నారు పిల్లలు.

డూడూ బసవన్నకి పాతబట్టలిస్తున్నారు పెద్దోళ్ళు.

వండుకున్న పిండివంటలు ఆ వీధిలో ఉన్న ఇంటినించి ఈ వీధిలో ఉన్న ఇంటికి మోసుకెళ్తున్నారు ఆడపిల్లలు.

వాళ్ళందరి మధ్యలో నవ్వుతా నడుస్తున్న పోతంశెట్టి గనిరాజు మాత్రం జరీ అంచు కొత్తపంచా, కొత్త కాశీ తువ్వాలూ వేసుకుని కనిపించేడు.

అతన్నలా చూసిన తాడిసూర్రెడ్డిగారు ''ఏంటి గనిరాజు మాయ్యా..పండగరోజన్నా ఒంటిమీద చొక్కా వేసుకోవచ్చు గదా?''అన్నాడు.

నవ్వేసిన గనిరాజు ''వేసుకోడానికి ఈ వూళ్ళో నన్ను ఎరగని వాళ్ళు ఎవరున్నారు బాబా'' అన్నాడు.

కొన్నాళ్ళ తర్వాత ఒకరోజు ఏదో పనిమీద కాకినాడ వెళ్ళడం కోసం కాలవదగ్గర బస్సుకోసం నిలబడ్డ గనిరాజు పంచె భుజం మీద కాశీ తువ్వాలుతో మాత్రమే ఉన్నాడు. చేతిలో మాత్రం చిన్న చిక్కం ఉంది.

అతన్నాలా చూసిన కాకి వీర్రాజు గనిరాజుబాయ్యగారూ ఇంతకాలం చొక్కా వేసుకోరేంటని అడిగితే ''వూళ్ళో నన్ను ఎరగనోళ్ళు ఎవరున్నారు అన్నారు... కాకినాడ వెళ్తున్నారు ఇప్పుడన్నా చొక్కా వేసుకోవచ్చు గదా?'' అన్నాడు.

''ఏసుకుంటానుగానీ...కాకినాడలో నన్ను ఎరిగున్నోళ్ళు ఎవరున్నార్రా బాబా?'' అని ఎదురుప్రశ్న వేస్తా నవ్వేసేడు పోతంశెట్టి గనిరాజుగారు.

* * *